# నవ్విస్తున్న నవ్వులాటలు

పోటుకూచి సాంబశివరావు





వెంకట్‌కు నేనంటే గౌరవం. అందువలన అప్పుడప్పుడు నా దగ్గరకు వస్తూ ఉంటాడు. అతడు చూడటానికి అష్టావక్రుడు. పళ్ళు ఎత్తు. దవడలు లోతుకుపోయి ఉంటాయి. కళ్ళు మెల్ల. చింపిరిజుట్టు. సన్నగా ఉంటాడు. నడక కొద్ది కుంటి. మాట కంగారు, ముద్ద, కొంచెం నత్తి. ఇన్ని లక్షణాలున్న అతను చాలా మంచివాడని నా అభిప్రాయం. అందుకే అతనొస్తే నా స్వంత విషయాలను ప్రక్కన పెట్టి అతన్తో కొంతసేపు మాట్లాడుతాను.

ఒకరోజు చాలా కోపంగా వచ్చాడు.

"సార్! నాకు మా నాయన మీద చాలా కోపంగా వుంది" అన్నాడు.

"ఎందుకు?"

"పెళ్ళి చేసుకోమంటాడు."

"అందులో తప్పేముంది?"

"అదికాదు సార్! నేను ఏమీ సంపాదించడం లేదుగా! పెళ్ళి చేసుకుంటే పెళ్ళాన్ని ఎలా పోషించాలి?"

"అది నేనెలా చెప్పగలను?" నవ్వి వూరుకున్నా.

"అయితే మళ్ళా చదువుకోలేదు సార్!"

"నాలా చదువుకొని కథలు వ్రాసే పిల్లను పెళ్ళి చేసుకోవాలని వుంది!" అన్నాడు వెంకట్ కొంచెం చిరునవ్వుతూ.

"ఇద్దరూ కథలు వ్రాస్తూ కూచుంటే ఇంట్లో వంట చేసే వారెవరూ?" అన్నాను చలోక్తిగా.

"వంట సమయంలో ఐడియాలు వచ్చినా ఏం కథలు వ్రాయం సార్" అన్నాడు వెంకట్. వాడి నిర్ణయానికి నా జోహార్లు.

వాడు చెప్పిన లక్షణాలన్నీ వున్న పిల్ల ఎక్కడ దొరుకుతుంది. పైగా రచయిత్రి కావాలంటాడు.

"ఇంతకీ నీ కొరకై మీ నాన్న చూసిన పెళ్ళికూతురు ఎలా వుంటుంది?" అన్నాను. "నల్లగా వుంటుంది సార్. చదువుకోలేదు. మంచి భోజన ప్రియురాలు. దానికితోడు భారీ శరీరం కూడా. పైగా నేనా, సన్నం" అన్నాడు బాధగా.

"అయితే నీకొచ్చే ఇబ్బందేమిటి?" అన్నాను నేను.

"ఇబ్బందేమిటని మెల్లగా అడుగుతున్నారా సార్. మా ఇద్దరి జంట వీధిలో వెళుతూంటే, సంచార జంతు ప్రదర్శనశాలలా వినోదం కలిగిస్తున్న వారమౌతాము ప్రజలకు. అందరూ మమ్ములను వింతగా చూస్తారు. అందుకే ఈ పెళ్ళి నా కిష్టం లేదు" అన్నాడు.

"మీపై మా నాన్నకు గౌరవం వుంది. అందుకే ఎలాగైనా మీరు మా నాన్నతో చెప్పి ఈ వివాహ ప్రయత్నాన్ని ఆపించండి సార్!" అన్నాడు వెంకట్ ప్రాధేయపూర్వకంగా.

అలాగే అని వాళ్ళ నాన్నదగ్గరకు వెళ్ళడానికి అంగీకరించాను.

అయితే ఏం లాభం. వెంకట్ నాన్నగారి వాగ్ధాటికి నిలవలేక నా రాయబారం విఫలమయింది — పైగా వాళ్ళ నాన్న ద్వారా నాకు కొంత అవమానము కూడా జరిగింది. నా సాహచర్యం వలననే వెంకట్‌కు సాహిత్య పిచ్చి పట్టిందట. ఆ పిచ్చిని తగ్గించడానికి పెళ్ళి ఒక్కటే మార్గమని వారి జవాబు—

చివరకు పంచభూతాల సాక్షిగా వెంకట్ పెళ్ళయిపోయింది.

పెళ్ళయిన కొంతకాలంవరకు నాకు వెంకట్ కనిపించలేదు.

హఠాత్తుగా ఓసారి ప్రత్యక్షమయ్యి నన్ను సంభ్రమాశ్చర్యంలో ముంచేశాడు.

"నేనొక కొత్త కార్యక్రమాన్ని మొదలుపెట్టాను సార్?" అన్నాడు.

"ఏమిటోయ్ అది?"

సైకిల్ మీద మన గ్రామం నుంచి మద్రాస్ వెడుతున్నా! దానికి మీ సహాయం కావాలి. దారిపొడుగునా నాకు ఉత్సాహం కలిగించడానికి, వివిధ ప్రదేశాలలో నాకు ఘన స్వాగతం పలకడానికి నా భోజన సౌకర్యానికి మీరు ఏర్పాట్లు చేయాలి సార్! అన్నాడు.

"ఇది నిజంగా మహా కార్యక్రమమే. అయినా నీకు అలాటి ఏర్పాట్లు చేయడానికి నేనేమయినా మంత్రిగారి అల్లుడినా? మంత్రిగారి ప్యూనునైనా కాదు. నేనో మామూలు రచయితను—

కావాలంటే నాకు చేతనైన సహాయం యాభై రూపాయలు ఇస్తాను తీసుకో' అన్నాను.

ఎలా అయితేనేం అతను తన మద్రాస్ సైకిల్ యాత్రకు రంగం సిద్ధం చేసుకొన్నాడు.

నేను ఇంట్లో లేని సమయంలో వచ్చి తాను రేపే మద్రాసు యాత్రను మా వూరి గణపతి ఆలయం నుంచి ప్రారంభిస్తున్నానని నన్ను తప్పక రమ్మనమని ఇంట్లో చెప్పి వెళ్ళాడు.

మరునాడు అతను చెప్పిన స్థలానికి వెళ్ళాను.

సకుటుంబ సపరివారముగా తన యాత్రను విజయము చేయమని మొక్కడానికి విఘ్నేశ్వరుని చుట్టూ ప్రదక్షిణ చేశాడు.

సైకిల్ ఎక్కడానికి సిద్ధమయిన వెంకట్‌కు పంచరైన తన సైకిలే కనిపించింది. "కార్యశూరునికి చిన్న చిన్న అడ్డంకులో లెక్కా?" అంటూ సైకిల్ రిపేర్ చేయించుకొని వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. "చూడండి ఈ యాత్రలో మీకేదో ఆపద సంభవించబోతుంది. అందుకే సైకిల్ పంచరైంది. మీ ప్రయత్నాన్ని ఆపడానికి భగవంతుడు ఇది నీకిచ్చిన సందేశం" అంది తెలుగు భక్తి సినిమాలు తెగచూసే అతని భార్య ఆండాళమ్మ.

ఏడ్పులు పెడబొబ్బలతో ఇచ్చటేదో మహా సంగ్రామం జరుగుతుంది అని చూసేవారికి అనిపించేట్టుగా ఆండాళ్ళు చేసిన హంగామాతో వెంకట్ తన మద్రాసు యాత్రను విరమించుకొన్నాడు.

ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన అధికారపార్టీ అభ్యర్థిలా విచారంగా ముఖం పెట్టాడు వెంకట్.

"నా జీవితమిక విషాదభరితంగా అయ్యేట్టుంది సార్!" అన్నాడు భారంగా.

"ఎందుకు" అన్నాను.

"ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ హస్తం వుంటుందంటారు. కాని నా పాలిట మా ఆవిడే విలన్‌లా తయారైంది" అన్నాడు. "నేను జీవితంలో విజయం సాధించాలంటే మా ఆవిడను వదులుకోవలసిందే. అందుకే ఆమెకు విడాకులిచ్చి మరో వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. నా ఆదర్శాలకు సరిపోయే మా వీధిలో 7వ నెంబర్ ఇంటిలో వుండే పంకజాక్షిని ప్రేమించడం మొదలుపెట్టాను. మా ప్రేమ విషయం మా మామకు తెలిసిందా అంటే, ఇటు ఆండాళ్ళుతో విడాకులు అటు, పంకజాక్షితో వివాహం ఒకేసారి జరుగుతాయి. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు. ఎలావుంది సార్ నా ఐడియా" అన్నాడు.

"అదిసరే నీ బ్రహ్మాండమైన ప్లాను బాగానే వుంది. కాని నీవు పంకజాక్షిని ప్రేమిస్తున్నావు. మరి నిన్ను ఆమె ప్రేమిస్తుందని నమ్మకమేమిటి?" నా ధర్మ సందేహాన్ని బయటపెట్టాను.

"అవునండీ నేను వన్ వే ట్రాఫిక్‌లోనే వెళుతున్నాను. అటునైపు ఆలోచించడం లేదు మరి ఆ విషయం తెలియాలంటే ఏం చేయాలి" అన్నాడు.

"ముసుగులో గుద్దులాట ఎందుకు. డైరెక్ట్‌గా వెళ్ళి అడిగేసేయ్" అన్నాను.

"తీరా నా వెంప చెళ్ళు మనిపిస్తే?" అన్నాడు వెంకట్.

"అయితే ఒక పనిచేయి. ఆ రోజుల్లో ప్రేమికులు తమ సందేశాలను హంసల ద్వారానో, మేఘాల ద్వారానో పంపేవారు. ఇప్పుడు హంసలు మనకు అందుబాటులో లేవు. మేఘాలు మన మాట వినవు. వీటికంటే సులభ మార్గం నీ ప్రేమనంతా ఓ శ్వేతపత్రంపై ఎక్కించి పోస్ట్ చేయ్" అన్నాడు.

"బాబోయ్! అది పుచ్చుకుని వూరంతా చాటితే నా గతేంగాను?" అన్నాడు వెంకట్.

"మరో మార్గమేముంది?" అని "పోనీ చీకట్లో కన్ను కొట్టు!" అన్నాను చమత్కారంగా.



బాపట్లలో ఆరుద్రను సన్మానిస్తున్న సాంస్కృతిక సమాఖ్య నగరశాఖ కార్యదర్శి శ్రీ యజ్ఞశ్రీ

"బాగుంది సార్ ఈ ఐడియా — ఎవరూ చూడకుండా చీకట్లో కన్నుకొడితే లవ్ చేసేస్తుంది" అన్నాడు వెంకట్.

తరువాత కొంచెం ఆలోచించి!

"సార్ చీకట్లో కన్ను కొట్టడం ఆ అమ్మాయికి కనిపించాలి కదా!" అన్నాడు వెంకట్.

"అందుకేనయ్యా బ్యాటరీలైట్లు ఉపయోగం" అన్నాను నేను నవ్వుతూ.

"సార్ ఈ ప్రేమజంటకు మీరే ఎక్కడయినా కొండమీద గుడిలో పెళ్ళి చేయాలి" అన్నాడు వెంకట్. ఒప్పుకోక ఏం చేస్తాను? అప్పటికి వాగ్దానం చేసి ఊరుకున్నా. మళ్ళీ రెండు రోజుల తరువాత వెంకట్ కనిపించాడు.

ఈలోగా వెంకట్ ఆ అమ్మాయికి కన్నుకొట్టడం, ప్రేమ సిగ్నల్స్ తెలపడం జరిగిపోయాయి.

అది తెలుసుకున్న ఆ అమ్మాయి అన్న వెంపమీద చావమోదగా కన్నుకు గాయం తగిలి లొట్టయింది. హా ముందుకు రాగానే శుక్రాచార్యునిలా కనిపించాడు వెంకట్.

అష్టావక్రుడు అలా నవ వక్రునిలా మారాడు.

"సార్ మా పెళ్ళవటం చాలా కష్టం. మీ సలహా చాలా ప్రమాదకరం!" అన్నాడు వెంకట్ కోపంగా.

"నేనేం చేశాను?" అన్నాను అమాయికంగా.

"ఓ కన్ను పోయినట్టే! రెండో కన్నుతో కవిత్వాలు వ్రాయడం ఎలాగ సార్!"

"పైగా ఉన్న ఒక కంటికి ముందుగా నా భార్య ఒక్కతే కనిపిస్తుంది. దాన్ని చూస్తుంటే ఉన్న కవిత్వం కూడా పోతుంది" అన్నాడు వెంకట్.

"అందుకే నువ్వు కవిత్వం వ్రాయవద్దు" అన్నాను నేను.

నా మీద వెంకట్‌కు కోపం వచ్చింది.

"ఎందుకు సార్, మీ బోడి సలహాలు!" అన్నాడు వెంకట్ రుసరుసలాడుతూ.

"నాలాంటి కవిని కవిత్వం వ్రాయవద్దని అనటానికి మీకెలా నోరువచ్చింది?" అన్నాడు వెంకట్.

"నాకు నీ మీద ద్వేషం లేదోయ్! నువ్వు కవిత్వం వ్రాయడం మాని కవిత్వం వ్రాయడం ఎలాగో నేర్పు! దానికి ఒక స్కూలు పెట్టు లాభసాటిగా వుంటుంది" అన్నాను అంతరంగంలో వ్యంగ్యంగా.

"ఈ రోజుల్లో అక్షరం ముక్కలు వచ్చిన ప్రతివాడు కవిగా రాణించాలని గోలపెడుతున్నాడు" అన్నాను. అది చలోక్తి అని నేననుకున్నాను. కాని కొన్నాళ్ళ తర్వాత ఓరోజు సాయంత్రం ఆబిడ్సు రోడ్డులో నడిచి వెడుతున్నాను. ఒక మేడ మీద నుంచి వెంకట్ నన్ను పిలుస్తూ కేకవేస్తున్నాడు. పైకి చూడగానే వెంకట్ చేయి ఆడిస్తూ స్వాగతం చెబుతూ నన్ను రమ్మంటున్నాడు. వాడి చేతికి దూరంగా ఒక బోర్డు 'కవితా పాఠశాల' అని — సరేకదా అని పైకి వెళ్ళాను. అతని భార్య హిడింబి అవతారంలో అక్కడేవుంది. అందరికీ వారిద్దరూ కవిత్వం నేర్పుతున్నారు! ఇంతలో కొంతమంది 16 ఏండ్లలోపు పిల్లకాయలు " 'మే''మే' 'మే' " అంటూ మేకల మందలో మేకల్లా గబగబా వచ్చి నాకు శాల్యూట్ చేశారు -ఆ పిల్ల కవులనుచూసి నేను పులిలా లోలోపల ఫీలయినా, చివరకు పిల్లిలా భయపడుతూ తప్పుకున్నాను.

"ఈయన మా గురువుగారండి" అన్నారు పిల్లలు ఏకకంఠాలతో. వెంకట్ వదనంలో చిదానందం నిండింది.

అతని భార్య సుడిగుండంలా తిరిగి పిడుగులా వురుముతూ నవ్వింది.

నా తలమీద చేతులు వేసుకుని ఓ కుర్చీలో కూర్చున్నాను.

'ఆచార్య' 'సాహిత్యరత్న' బిరుదులుకూడా వెంకట్ తానే ఒక బోర్డులో తన పేరుముందు తగిలించుకున్నాడట. వెంకట్ పేరు వెంకటేష్‌గా మార్చుకున్నాడు, ఒక కన్నుపోయాక ఇంక క్రొత్త ఆలోచనలు రావడం తన అదృష్టం అన్నాడు. ఇక తప్పనిసరిగా ఆ కవితా దంపతులను, వారి పాఠశాల సంసారాన్ని దీవించాను.

శరీరంలో ఒక అంగం చెడితే ఆ శక్తి మెదడుకు వస్తుందట!

హాయిగా తృప్తిగా వెంకట్ కనిపించాడు. ఆలోచనలతో ఇంటికి తిరిగి రాగా, గదిలో ధూళిమధ్య 'వైతాళికులు' గ్రంథం మూలపడి కనిపించింది. పాపం నేటి చరిత్రలో ఈ వైతాళికులకు స్థానం లేదు అని విచారించాను.

*



Chhaya/PP/415